# జీవనం

-పురిజాల సుధాకర్

గవర్నమెంట్ భయపడుతున్నంత పనీ చేసింది.

ఆంధ్రా యూనివర్సిటీ ఎఫిలియేషన్ ఉన్నాసరే మా కాలేజీని గుర్తించలేదు. పైగా అనేకరకాల కారణాలు చూపెడుతూ 'కేన్సిలేషన్ ఆర్డర్స్' పంపింది.

కాలేజీ మేనేజ్‌మెంట్ కోర్టుకెళ్లింది.

మేం అంతా మోసపోయాం.

మా అందరి అకౌంట్స్ సెటిల్ చేసి పంపేశారు.

మళ్లీ కోర్టు తీర్పు వచ్చాక కాలేజీ తెరిస్తే పిలుస్తాం అన్నారు.

ఎడారిలో ఒయాసిస్సులా దొరికిన ఆ ఉద్యోగం పర్మనెంట్ అవుతుందన్న సమయంలో ఈ కోర్టుల గొడవ.

నిరుద్యోగం నరకయాతన.

మళ్లీ అన్వేషణ-

కాంపిటీషన్ రోజురోజుకీ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మళ్లీ ఉద్యోగం అంటే మాటలా?

మళ్లీ చరిత్ర పునరావృతం!

ఏం బ్రతుకు?

"బాబూ.. బట్టలెయ్యండి" చాకలి వీరన్న పిలుపుతో ఉలికిపడ్డాను. మాసిన డ్రెస్‌లు తెచ్చి పడేశాను.

"వీరన్నా ఈ మధ్య బట్టలు త్వరగానే తెస్తున్నావు. ఇలా ఇస్తే నిన్నెందుకు పనిలోంచి తీసేస్తాను?" అన్నాను.

"తవలాంటోళ్లకి తెలీనదేం ఉందయ్యా? నన్ను పనిలోంచి తీసేస్తాం అన్నారా? గుండె గుభేల్‌మంది. పేనం విలవిలలాడిపోనాది. ఏదో తాగుబోతు ఎదవని. మీ బట్టలు ఏసుకున్నానే అనుకోండి- కానీ, మీరు కల్లారా కోప్పడిన కాడ్నించీ ఏసుకుంటే ఒట్టు బాబూ.. మీ వల్ల నూటేభయ్ రూపాయలు ఇంటికిస్తన్నాను. నూటేభయ్ రూపాయలు నేనుంచుకుంటున్నాను. నాకున్న మంచి నౌకరీల్లో మీదీ ఒకటి బాబూ.. నా మీద కోపం ఉంటే వీపుమీద కొట్టండి. ఫరవాలేదు. అంతేగాని, 'కడుపు' మీద కొట్టమాకండి"

వీరన్న బట్టలు పట్టుకుపోయాడు.

వీధి గుమ్మం వరకూ వెళ్లాను.

"వీరన్నా.. వీరన్నా.. రా.. రా..." పిలిచాను.

"ఏం బాబూ" వీరన్న అడిగాడు.

"నిన్ను పనిలోంచి తీసేద్దాం అనుకున్నాను.. నిజమేగాని తియ్యను. నువ్వు నా బట్టలు తొడుక్కున్నా సరే తియ్యను" నిశ్చయంగా అన్నాను.

"సానా సంతోషం బాబూ" తృప్తిగా అన్నాడు.

వీరన్న మొహంలో తృప్తి నన్నూ సంతృప్తిపరచింది. ■

## లోకాలయ

సమ్మెట సమ్మెటలుగా
నిగిడిన కండరాల బిగువంతా
ఇనుము పొగరుని
చపటగా చితక్కొట్టి
కొడవలిని ప్రసవిస్తుంది.
నాగేటి కర్రుని నిర్మిస్తుంది.
చెట్టును కూల్చే గొడ్డలి
బండిని నడిపే ఇరుసు
మోటకు వేలాడే సంకెల
వొక సుత్తె, వొక గునపం
దైహిక శ్రమనంతా పిండి పిండి
ఇనుపముద్ద ముక్కు పిండి
పనిముట్లకి ప్రాణం పోసిన
మొరటు విధాతై పోతుంది.
నిప్పుల కొలిమిలో
రగిలిన లోహమే కనిపిస్తుంది
కరిగిన కండ కనిపించదు
నిప్పుల కావడైన దేహం దృష్టించదు-
కూలిన చెట్లు తప్ప
కూల్చిన గొడ్డలి ఊసే లేనట్టు.
కోతకోసిన పైరు కుప్పలు తప్ప
కొడవలి జాడైనా లేనట్టు.
ఇప్పుడు కమ్మరి ఇంటినిండా
కన్నీళ్లు కారుస్తున్న ఆకలి
ఫ్యాక్టరీ చిమ్నీలకంటే పెద్దగా
కేకలు పెడ్తూంది దీనంగా!

(కనుమరుగైన కమ్మరిని స్మరిస్తూ...)

-పెరుగు రామకృష్ణ